వైద్యులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి



విధులు నిర్వర్తించే చోట వైద్యులకు రక్షణ కల్పించాలి. ప్రత్యేక వసతులు సమకూర్చాలి. రాత్రి పూట విధుల్లో ఉన్నప్పుడు సేఫ్టీగా ఉండేలా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. విధులను ప్రశాంత వాతావరణంలో, నిర్భయంగా నిర్వర్తించేలా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకుని రావాలి. ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేని పరిస్థితులు కనిపిస్తుండటం బాధాకరం. అదే విధంగా ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది కోసం అన్ని రకాల వసతులు కల్పించాలి.

– డాక్టర్ దివ్యమేఘన, వైద్యాధికారి, ప్రత్తిపాడు

విధుల్లో ఉండగా రక్షణ అవసరం



ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఉదంతం మానవ సమాజానికి మచ్చలాంటిది. ఈ ఘటన తరువాత వైద్యుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. రాత్రివేళ పనిచేసే సిబ్బంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అస్పత్రులకు, సిబ్బందికి పోలీసు భద్రత కల్పించాలి.

– అబ్రహం లింకన్, చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి

క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని బొందలపాటి మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ 34వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం 74 మంది విద్యార్థులకు రూ.2,100 చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గత టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి, ప్రస్తుతం ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బొందపాటి వేంకట ఫణికుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ మోగ్రా, రవితేజ, ఉమాదేవి, రామ్ ప్రసాద్, రాజు, శివనాగేశ్వరరావు, సంస్థ మేనేజర్ వేల్పూరి మారుతిరాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: కృష్ణాష్టమి సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో విశ్వ శాంతిని కాంక్షిస్తూ చండీహోమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ_ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మేకా దేవేంద్ర కుటుంబ సభ్యులతో తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివ లింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యునిగా పొత్తూరి రంగారావు



నగరంపాలెం: గుంటూరు జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యుడిగా కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు నియమితులయ్యారు. గుంటూరు అరండల్‌పేట ఆరో వీధిలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రంగారావు మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యునిగా నియమిస్తూ ఈనెల 11న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వినియోగదారుల సమస్యలను అధికార యంత్రాంగ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తానని చెప్పారు.

ముమ్మరంగా మినుము కోతలు

తాడికొండ: మినుము సాగు చేసిన రైతులు.. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో హార్వెస్టర్‌తో పంట కోత మొదలు పెట్టారు. ఎకరాకు గతంలో రూ.1,800 నుంచి రూ.2వేల వరకు వరకు ఉండే యంత్రం అద్దె ఇప్పుడు గంటకు రూ.2,500గా ఉంది. వర్షం పడితే పంట ఇంటికి చేరడం కష్టతరమయ్యే పరిస్థితి ఉన్న నేపథ్యంలో రైతులు హార్వెస్టర్ యంత్రాలను ఆశ్రయించి, త్వరితగతిన పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చుకుంటున్నారు.

జయకృష్ణా ముకుందామురారే..

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

గుంటూరు రూరల్: శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ రాధాకృష్ణా ఫ్రెండ్‌సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ కృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రామాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తులు పాల్గొన్నారు.



వెంగళాయపాలెంలో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణుడు



ప్రత్తిపాడులో విశేష పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు

ఆడిపాడిన ఆబాల గోపాలం

ప్రత్తిపాడు: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. గోకుల కృష్ణా గోపాల కృష్ణా అంటూ ఆ బాల గోపాలం ఆడి పాడింది. ప్రత్తిపాడులోని గంగమ్మ గుడి వద్ద ప్రత్యేకంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీ కృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన భారీ అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పాల్గొన్నారు. తదనంతరం స్వామి వారిని మేళతాళాలు, డీజే మోతల నడుమ గ్రామోత్సవంగా పురవీధుల్లోనికి తరలించారు. భక్తులు స్వామి వారికి వారులు పోసి హారతులిచ్చారు. అదే విధంగా తుమ్మలపాలెంలోని శ్రీకృష్ణుని దేవాలయం, స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొనేందుకు చిన్నారుల నుంచి పెద్దల వరకు పాల్గొన్నారు. నువ్వా నేనా అన్న రీతిలో యువత ఉట్టి కొట్టేందుకు రెట్టించిన ఉత్సాహంతో పోటీపడ్డారు.



వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద మనవడితో ఉట్టి కొట్టిస్తున్న తాత



పూజల్లో పాల్గొన్న పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి

పొన్నూరు: పొన్నూరులో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేశారు. మాచవరం, పట్టణంలోని ఎనిమిదో వార్డు క్యాబిన్‌పేటలోని శ్రీ కృష్ణుని దేవాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు.

ఇస్కాన్ మందిరాల్లో అభిషేక పూజలు

పెదకాకాని: కృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. పెదకాకాని మండలంలోని నంబూరు, పెదకాకాని, వెనిగండ్ల గ్రామాల్లో ఉన్న ఇస్కాన్ మందిరాలు, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలకు సాయంత్రం వేళ భక్తులు చేరుకుని అభిషేకపూజల్లో పాల్గొన్నారు. ఇస్కాన్ మందిరాల్లో హరేరామ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే అంటూ సంకీర్తనలు ప్రతిధ్వనించాయి. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఆనందోత్సాహాల మధ్య సందడి సందడి సాగాయి. రాత్రి వేళల్లో ఆలయాలు విద్యుత్ కాంతులతో కళకళలాడాయి.



పెదకాకాని ఇస్కాన్ మందిరంలో అభిషేకపూజలు చేస్తున్న అర్చకులు

పరుగులు పెట్టించిన కారుమబ్బులు

ప్రత్తిపాడు: నీలాకాశంలో కమ్ముకుంటున్న కారు మబ్బులు కొందరు రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాయి. మండలంలో అక్కడక్కడా కొంత మంది కర్షకులు సాగు చేసిన మినుము పంట దిగుబడులు చేతికొచ్చాయి. వాటిని పొలాలకు సమీపంలో ఎండబెట్టారు. అయితే ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండటంతో దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు హైరానా పడుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన మినుము పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టాలు కప్పుకుంటున్నారు. ఆ చిత్రాలే ఇవి. సోమవారం సాయంత్రం గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డులో తిక్కిరెడ్డిపాలెం సమీపంలో కొందరు రైతులు ఇలా పట్టాలు కప్పుకుంటూ కనిపించారు.



మినుము దిగుబడులపై పట్టాలు కప్పుతున్న రైతన్న



మినుముపై టార్పాలిన పట్టాలు కప్పకుంటున్న కర్షకులు

శాంతి సమాజ స్థాపకురాలు మదర్ థెరిసా

నెహ్రూనగర్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ సేవకు ప్రతిరూపమైన మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని లక్ష్మీపురంలోని మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ యుగేస్లావియాలో జన్మించిన మదర్ థెరిసా భారతదేశంలో స్థిరపడి పేద ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించారని కొనియాడారు. అతిచిన్న వయసులోనే తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి కోల్‌కతాలో భయంకరమైన వ్యాధులు సోకిన నిరుపేదలు, అభాగ్యులకు తన సేవల ద్వారా జీవితాన్ని ప్రసాదించారన్నారు. ప్రపంచంలోని 123 దేశాల్లో 610 శాఖాలతో మిషన్ ఆఫ్ చారిటీస్ తరఫున అనేక మంది పేద ప్రజలకు సేవలు అందించి నోబెల్ శాంతి బహుమతి, భారతరత్న లాంటి అవార్డులు అందుకున్నారని కార్యదర్శి కె.సతీష్ తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్‌హృదయ సిస్టర్స్, సంస్థ కోశాధికారి టీవీ సాయిరాం, పి.సుధాకర్, అనంతరామయ్య, విజయలక్ష్మి, సురేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బీజేపీలోనే సామాన్య కార్యకర్తకు ప్రాధాన్యం

జిల్లా అధ్యక్షుడు నరేంద్ర కుమార్

గుంటూరు మెడికల్: సామాన్య కార్యకర్తకు ఉన్నత స్థాయి కల్పించిన పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నాలుగో మండలంలోని అరండల్‌పేటలోని రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్ నివాస ప్రాంగణంలో మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు మిస్డ్ కాల్ నెంబర్ గా 8800002024 ను కేంద్ర పార్టీ కేటాయించిందని తెలిపారు. సెప్టెంబరు 1న భారత ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ద్వారా సభ్యత్వం తీసుకుంటారని వెల్లడించారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి సభ్యత్వం తీసుకుంటారన్నారు. మండల సభ్యత్వ నమోదు ప్రముఖ్ పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య, సహ ప్రముఖ్‌లు మందలపు సురేష్ చౌదరి, పద్మనాభుని రమాదేవి క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ తిరుపతిరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు బి.సుగుణ, నాయకులు ఈ శ్రీనివాసరెడ్డి, వి.గంగాధర్, ఎం.అశోక్ నాగసాయి, వి.తిరుమలరావు, బి.రామకృష్ణ, ఎం.మనోహర్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న వనమా నరేంద్ర కుమార్

'సంపు'లను బాగు చేసి బ్లీచింగ్ చల్లారు



చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఎదురు సంపును క్లీన్ చేస్తున్న సిబ్బంది



వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద సంపులో ఉన్న మురికి నీటిని బయటకు పారబోస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: అధ్వానంగా ఉన్న నీటి సంపులను ఎట్టకేలకు అధికారులు బాగు చేశారు. ప్రత్తిపాడులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న సంపుతో పాటు వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద ఉన్న సంపుల్లో నీరు రంగు మారి ప్రమాదకరంగా మారాయని, ఇలా ఉంటే ప్రజలు రోగాల బారిన పడతారంటూ ఈ నెల 26వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'సంపు'తాయి బాబోయ్!' కథనంపై సంబంధిత శాఖల అధికారులు స్పందించారు. ఆదివారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ కుమార్, పంచాయతీ సిబ్బందితో సంపులను క్లీన్ చేయించారు. మురుగునీరును బయటకు తోడించారు. సంపుతో పాటు చుట్టుపక్కల బ్లీచింగ్ చల్లి బాగు చేశారు.



సంపు వద్ద చల్లుతున్న బ్లీచింగ్

నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా ఉదయం సమయాల్లో నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు చుట్టుగుంట వైపు నుంచి ఎస్వీఎన్ కాలనీ, జేకేసీ కళాశాల, శ్యామలానగర్ రహదారుల వైపు నుంచి ట్రాక్టర్లు, లారీలకు ఎటువంటి ప్రవేశం లేదని తెలిపారు. నో ఎంట్రీ సమయంలో నగరంలోకి భారీ వాహనాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిబంధనలకనుగుణంగా లారీ, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు వ్యవహరించాలని సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

పట్నంబజారు: గంజాయి నిల్వలు కలిగి ఉండి, విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురానికి చెందిన మైనంపాటి వెంకటేశ్వర్లు, వెంకటశివరామకృష్ణ గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాడిచేశారు. వసంతరాయపురంలోని వారి నివాసాల్లో రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత

తాడేపల్లిరూరల్ : గురువు లేకపోయినా విలువిద్యలో రాణించిన ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత అని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం గిరిజన నాయకులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కమిషనర్ ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు.

మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులను కైవసం చేసుకున్న సందర్భంగా సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బ్రాడీపేటలోని సంస్థ క్యాంపస్ నుంచి అధ్యాపకేతర సిబ్బందితో బయలుదేరిన బైక్ ర్యాలీని మెయిన్ క్యాంపస్ ఇన్‌చార్జ్ వై.శ్రీనివాసరావు, ఆంజనేయ విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎంఏ ఫైనల్‌లో తమ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ఒకటో ర్యాంకు సహా 3, 8వ ర్యాంకులతో పాటు సీఎంఏ ఇంటర్‌లో 3, 9వ ర్యాంకులను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించారని అన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వై. శ్రీనివాసరావు, ఆంజనేయ విజయ్‌కుమార్

తాగి తందనాలు

మందుబాబుల వీరంగం

- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం
- పొన్నూరులోని రద్దీప్రాంతాల్లో దుస్థితి
- బెల్టుషాపులను తలపిస్తున్న కిల్లీ కొట్లు
- పట్టించుకోని అధికారులు

పొన్నూరు: పొన్నూరులో బహిరంగ మద్యపానం పెచ్చుమీరుతోంది. ప్రధాన సెంటర్లలో, రద్దీ ప్రాంతాల్లో తాగుబోతులు తాగి తందనాలు ఆడుతున్నారు. వీరంగం సృష్టిస్తున్నారు. ఖాళీస్థలాలు, వెంచర్లతోపాటు ప్రధాన సెంటర్లలోని మద్యం దుకాణాల వద్ద రోడ్లనే బార్లుగా మార్చేస్తున్నారు. బహిరంగంగా కూర్చుని తాగి గొడవలు సృష్టిస్తున్నారు. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు. పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు ఉన్నాయి. అక్కడి మద్యం దుకాణం ఆవరణలో ఉన్న సిగరెట్ షాపు వద్దే మందుబాబులు తాగుతూ అటుగా వెళ్లే విద్యార్థినులు, ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారు. కిళ్లీ కొట్లు బెల్టుషాపుల్లా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొన్నూరు ఐలాండ్ సెంటర్ మద్యం దుకాణం వద్ద బహిరంగంగా తాగుతున్న మందుబాబులు

పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిడుబ్రోలు రైల్వే స్టేషన్ వెళ్లే దారిలోనూ మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధానమార్గం కావడంతో మహిళలు ఒంటరిగా రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు భయపడుతున్నారు. డివైడర్‌పై, రైల్వే ట్రాక్‌పై కూర్చుని యువకులు మద్యం తాగుతున్నారు.

గతంలో కట్టుదిట్టం..

గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగంగా మద్యం తాగిన వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు పెట్టేవారు. పోలీస్ శాఖ చేపట్టిన చర్యలతో బహిరంగంగా తాగేవారు చాలా వరకు తగ్గారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.



నిడుబ్రోలు రైల్వేస్టేషన్ రోడ్డులో మద్యం తాగుతున్న మద్యంప్రియులు



బడ్డీకొట్టు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

కఠిన చర్యలు



బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తాం. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదు. రోజూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

– రవి కిరణ్, పట్టణ సీఐ, పొన్నూరు

ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి పటిష్టమైన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ(ఎస్పీఎల్టీఏ) ఆధ్వర్యంలో సోమవారం ఏసీ కళాశాలలోని ఆడిటోరియంలో ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని, వారిని గౌరవించుకోవడం మన విధి అని అన్నారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, ఏఎన్‌యూ రెక్టార్ రత్నషీలామణి, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, వైస్ ప్రిన్సిపాల్ అమృతవర్షిణి, కన్న స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు, అప్పుస్మా, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య నాయకులు కాటూరి వెంకటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.